ఆంధ్రజ్యోతి ప్రవాస

# డాలస్‌లో ఘనంగా గాంధీ 148వ జయంతి వేడుకలు



**డాలస్, టెక్సాస్:** మహాత్మా గాంధీ 148వ జయంతిని పురస్కరించుకుని 'మహాత్మాగాంధీ మెమోరియల్ ఆఫ్ నార్త్ టెక్సాస్' అక్టోబర్ 1న డాలస్‌లోని ఇర్వింగ్ నగరంలో ఉన్న మహాత్మా గాంధీ మెమోరియల్ ప్లాజా వద్ద ఐఏఎన్‌టీ ఆధ్వర్యంలో 'గాంధీ పీస్ వాక్' కార్యక్రమం జరిగింది. ఈ పీస్‌వాక్‌లో వందలాది మంది భారతీయులు పాల్గొన్నారు. శాంతికి నిదర్శనంగా ఈ కార్యక్రమంలో పిల్లలు, పెద్దలు అందరూ తెల్లని టోపీలు, తెల్లని దుస్తులు ధరించారు. ఈ కార్యక్రమానికి ఇర్వింగ్ నగర మేయర్ ప్రొటెం ఆలన్ మేఘర్, హ్యుస్టన్ నగరం నుంచి కాన్సుల్ ఆఫ్ ఇండియా ఆర్. డి. జోషి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఎంజీఎంఎన్‌టీ డైరెక్టర్లలో ఒకరైన శ్రీమతి షబ్నమ్ మోద్గిల్ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. గాంధీ మహాత్ముడి జయంతిని పురస్కరించుకుని అక్టోబర్ 2 తారీఖును ఐక్యరాజ్య సమితి "అంతర్జాతీయ అహింసా దినోత్సవం"గా ప్రకటించారని గుర్తుచేశారు. రావు కల్వల, ఎంజీఎంఎన్‌టీ సెక్రటరీ అందరికీ ఆహ్వానం పలుకుతూ, ఇర్వింగ్ సిటీ, కమ్యూనిటీ, అమెరికాలోనే అతి పెద్ద గాంధీ మెమోరియల్‌ను స్థాపించడానికి కలిసి పని చేసినందుకు చాలా సంతోషకరంగా ఉందన్నారు. ఇందుకోసం పాటుబడిన వారందరికీ తన ధన్యవాదాలు తెలిపారు.

కార్యక్రమాల విజయవంతం కోసం నిరంతరం కృషి చేసే ఎంజీఎంఎన్‌టీ బోర్డు సభ్యులను ఎంజీఎంఎన్‌టీ కో చైర్మన్ అయిన జాన్ హామండ్ అందరికి పరిచయం చేశారు. సల్మాన్ ఫర్షోరి, ఐ.ఏ.ఎన్.టి అధ్యక్షుడు ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. గాంధీ పీస్ వాక్‌ను గాంధీ స్మారక విగ్రహం వద్ద నిర్వహించడం ఎంతో ఉత్సాహంగా ఉందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమానికి ప్రత్యేక అతిథిగా వచ్చి, గాంధీ జయంతి కార్యక్రమంలో పాల్గొనడం తనకు గర్వకారణంగా ఉందని ఇర్వింగ్ నగర్ మేయర్ ప్రొటెం ఆలన్ మేఘర్ వ్యాఖ్యానించారు. చాలా సంవత్సరాలుగా సిటీ గవర్నమెంట్‌తో కలిసి పని చేస్తూ,కమ్యూనిటీ సంబంధిత కార్యక్రమాలను నిర్వహిస్తున్నందుకు ఎం.జి.ఎం.ఎన్.టి బోర్డు సభ్యులను ఆయన అభినందించారు. ఇటువంటి కార్యక్రమాలన్నింటికి తమ పూర్తి మద్దతు, సహాయం ఎల్లప్పుడూ ఉంటుందని తెలిపారు.

ప్రపంచ దేశాలు, ప్రజలు శాంతిని కలిగి ఉండటం చాలా ముఖ్యమని, మహాత్మా గాంధీ ఏ ఆయుధాలను ఉపయోగించకుండా భారత స్వాతంత్రం కోసం పోరాడారని ఎంజీఎంఎన్‌టీ చైర్మన్ డాక్టర్. ప్రసాద్ తోటకూర అన్నారు. అందుకే గాంధీజీని ప్రపంచ శాంతికి చిహ్నంగా గుర్తిస్తారని ఆయన అన్నారు. శాంతి ఒక చిరునవ్వుతో మొదలవుతుందని, అది ఒక గదికి వెలుగును ప్రసాదిస్తుందని అదే విధంగా ప్రపంచమంతా చిరునవ్వుతో నిండి ఉంటే అది ఏమి చేయగలదో ఊహించుకోవచ్చని డాక్టర్. తోటకూర ఉదహరించారు. మనమంతా ఒకరికి ఒకరు మానవతా దృక్పథంతో సహాయం చేస్తూ ఉంటే, శాంతి నెలకొంటుందని ప్రసాద్ తెలిపారు. ఎంజీఎంఎన్‌టీ బోర్డు సభ్యులు, అతిథులు శాంతికి గుర్తుగా తెల్లటి పావురాలను ఎగరవేశారు. తరువాత హాజరైన వారందరూ గాంధీ పీస్ వాక్ లో పాల్గొని, అనంతరం గాంధీ విగ్రహానికి పుష్పగుచ్ఛాలను ఉంచి తమ నివాళులు అర్పించారు. ఐ.ఏ.ఎన్.టి సెక్రటరీ బి.ఎన్ తమ టీమ్ సభ్యులకు, వాలంటీర్లకు, మీడియాకు, పోలీస్ సిబ్బందికి, ఇర్వింగ్ నగర అధికారులకు, ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసినందుకు ధన్యవాదాలు తెలిపారు. ఎంజీఎంఎన్‌టీ నిర్వహించే ఇతర కార్యకలాపాల వివరాలకు www.mgmnt.org ను సంప్రదించ్చునన్నారు.

ఫోటో గ్యాలరీ కోసం క్లిక్ చేయండి..